# చేపపిల్ల

- అల్లూరి గౌరీలక్ష్మి




"శ్రీకాంత్ సారూ, మీరూ లవ్వర్స్ అని మీ సెక్షన్ మగాళ్లంతా అనుకుంటున్రు మేడమ్" అని చాయ్‌తోబాటు వార్త గూడ చెప్పిన రాధ గారికి.

ఆమె షాక్ తిన్నలెక్క జూసింది నాకేసి.

"లేదు వీరేష్... అలాంటిదేం లేదు. మేం ఫ్రెండ్స్ అంతే" అని మొహం గింతజేసుకుంది. ఆ రోజంతా ఆమె అట్లనే ఉండింది. నాకు చానా జాలేసింది ఆయమ్మ మీద.

రాధా మేడమ్, శ్రీకాంత్ సార్, సలీమ్ సార్... గీ ముగ్గురూ ఈ సమత్సరమే ఈ ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్ల కొత్తగా జాయినయ్యిన్రు. రాధగారు మంచమ్మాయి. నాతో మంచిగ మాట్లాడ్తది. నేను కాంటీన్ల పనిచేస్త. మా కాంటీన్ చాయ్‌నే తాగుతరంతా. నేను ఆఫీసంతా తిరిగి అందరికీ చాయ్ సప్లయ్ చేస్త.

ఆ ఆఫీస్‌లో మిగిలినోళ్లంతా జర పెద్దోళ్లు ఏజ్‌లో. మగాళ్లెప్పుడూ ఆఫీస్ పాలిటిక్సూ, ఆడోళ్లెప్పుడూ ఇంటి ముచ్చట్లు పెట్టుకుంటరు.

రాధాగారు అవసరమయితేనే పక్కోల్లతో మాట్లాడ్తది. లేకుంటే గమ్మున కూచొని పుస్తకాలు చదువుకుంటది. ఆళ్లతోని, ఈళ్లతోని పిచ్చిపిచ్చి ముచ్చట్లెయ్యదు. అందుకే ఆమంటే నాకిష్టం.

ఇప్పుడిప్పుడే రాధాగారు శ్రీకాంత్ సార్‌తో ఏయేవో కంప్యూటర్ నదువుల గురించి మాట్లాడుతున్రు. ఇద్దరూ వేరే వేరేచోట్ల కంప్యూటర్ పరీక్షకి సదువుతున్రంట. ఆటి గురించి ఏమో చెప్పుకుంటరు.

తమతోని దోస్తానా చెయ్యరని ఈ ముగ్గురిపైనా సీనియర్‌లకి కోపముంటది. "యువతరమయ్యా... మనతో వాళ్లకేం ఉంటాయ్ మాటలు" అంటుంటరు.

రోజంతా మగోళ్లు ఎప్పుడంటే అప్పుడొచ్చి మా కాంటీన్ల సిగరెట్లు కాల్చుకుంట చాయ్, కాఫీలు తాగుతరు. ఆఫీస్ ఇషయాలు మాట్లాడతా ఉంటరు. ఆళ్ల బాస్‌లని తిడతరు. జోకులేస్తరు.

రెండు రోజులసంది కాంటీన్ల రాధమ్మ మాట ఇనొస్తాంది. "శ్రీకాంత్, రాధా మన సెక్షన్‌లో ప్రేమికులు" అని ఒకరూ, "నేనెప్పుడో కనిపెట్టా గురూ" అని ఒకరూ, "మనకెందుకోయ్ బాధ" అని ఒకరూ అంటుంటే ఊకోలేక సంగతి రాధ

గారికి చెప్పేసినా.

ఆమే మనుకుందో ఏమోగానీ శ్రీకాంత్ సార్‌తో మాట్లాడుడు జర తగ్గిచ్చింది. సలీం సార్‌తో మాటలు షురూ చేసింది. ఆయన అప్పుడప్పుడూ వస్తుంటాడామె సెక్షన్‌కి.

కొన్ని రోజులకి మా కాంటీన్ల జనాలు మళ్లీ గుసగుసలాడిన్రు. ఇన్న నాకు కోపమంటే కోపమొచ్చింది. ఏం జెయ్యాల్నో దెలీక రాధాగారికీ ఇషయం చెప్పేసినా. "మీరు పెళ్లి చేసుకోమని శ్రీకాంత్ సార్ నడిగిన్రంట. అందుకే ఆయన మీతో మాట్లాడ్తలేడంట. మీరిప్పుడు సలీం సార్‌కి లైనేస్తున్రంట."

"అరె... ఎందుకలా ఊహించి కథలల్లుతారు వీళ్లు. నాకు పెళ్లి కానంత మాత్రాన ఎవరితోనూ మాట్లాడకూడదా?" బాధగా అంది రాధగారు. కష్టపెట్టుకున్న ఆమె మొకంజూసి నాకూ కష్టమనిపించింది.

నేనేం చెయ్యాలి మరి? ఆమె ఆఫీసోళ్లు అన్న మాటలు ఆమెకి చెప్పినా. మన ఎనక ఎవరేం అనుకుంటున్రో మనకి తెలిస్తే మంచిదని గట్ల చెప్త.

ఒకరోజు రాఖీ పండగొచ్చింది. రాధగారు ఒక మంచి రాఖీ తెచ్చి సలీం సార్ని పిల్చి గట్టింది. సెక్షన్‌ల అందరికీ చాయ్‌లిమ్మని చెప్పింది. అట్లనే ఇచ్చినా. సలీం సార్ రాధమ్మకి మంచి పెన్ సెట్ బగుమతిచ్చిండు.

అంతా చప్పుడు చెయ్యకుండ చాయ్ తాగిన్రు. జనాలకి బుద్దొచ్చిందిలే, ఇంకెప్పుడూ ఆడకూతుర్ని బద్‌నామ్ పెట్టరు అని సంతోషిచ్చినా.

ఆ రోజు రాధా మేడమ్‌కి బాగా జెరమొచ్చింది. మూడు గంటలకి పర్మిషన్ అడిగి ఇంటికి బయల్దేరింది. "నా స్కూటర్ తెస్తానుండండి. ఇవాళ ఆటోల స్ట్రయికు. మీరు బస్‌ల కోసం నిలబడలేరు" అన్జెప్పి ఆమెను ఇంటి దగ్గర దిగబెట్టి వచ్చిండు సలీం సారు.

మర్నాడు కాంటీన్‌లో మళ్లీ మాటలినబడినై. ఏందా అని ఒక చెవ్వేసినా. ఇనగానే బుస్సుమని కోపమొచ్చింది నాకు. ఏడేడి చాయ్ ఆళ్ల మొహాన వొంపాలనిపించింది.

ఏం చెయ్యాలో తోచక రాధ గారి దగ్గరికి ఉరికి ఆమెకి చెప్పేసినా. "మీరు ఎవరికీ అనుమానం రాకండా రాఖీగట్టి సలీం సారుతో ఇస్కూటర్ల చెక్కర్లు కొడుతున్రని..."

నా మాటినగానే ఆమె వొణికిపోయింది. కళ్లనుండి నీళ్లు జలజలా రాలినై. అప్పటికప్పుడే లీవ్ రాసిచ్చేసి ఇంటికెళ్లిపోయింది.

నాకు చానా సిగ్గనిపించింది. అసలు తప్పంతా నాదే. నేను ఇన్నది ఇన్నట్టూరుకుంటే ఎంత బాగుంటుండే... అని ఆలోచిచ్చినా.

రాధా మేడమ్ మర్నాడు కూడా ఆఫీసుకు రాలే. నేను చాన పరిషానైనా. సిగ్గుపోయింది నాకు. నా వల్లే ఇదంతా అని బాగా ఏడ్సినా లోపల్లోపట.

ఆమె ఎందుకు రాలేదని ఎవరూ యాద్ చెయ్యలేదు. "సలీం వచ్చాడా ఆఫీస్‌కి. చూడండయ్యా?" అన్నాడొకాయన. నాకు రక్తం సలసలా మరిగిపోయింది. గింతలో సలీంసారొచ్చి కూర్చున్నడు. తేలు కుట్టిన దొంగల్లెక్క గమ్మునయిన్రంతా.

అసలీ జనాలు ఏం వాగుతరో అర్థమే ఉండదు. ఈళ్ల బుద్ధిలో ఉన్న వంకర్లన్నీ అందరికీ అంటగట్టి ఖుషీ అయితరు. జాలీ దయా లేని మనుషులు.

మూడో రోజు రాధా మేడమ్ రాంగానే నేను ఏడి చాయ్ తీస్కెల్లి గుడ్మాణింగ్ చెప్పినా. ఏదన్నా చెడ్డ కబురు తెచ్చినానేమో అని బయం పడుకుంటా నాయెంక చూసింది. నేను దోస్తులా, మంచిగా చూసి నవ్వినా. నా నవ్వు చూసినంక సల్లగాలి తగిలినట్టు మొహం సక్కగ పెట్టుకుంది రాధమ్మ. చిన్నపిల్ల లెక్క నన్ను జూసి నవ్వి చాయ్ తాగుడు మొదలు వెట్టింది. ఆమె నవ్వు జూసినంక నాకో సంగతి సమజైంది.

గాదినం నుండి కాంటీన్ల మంది మాట్లాడే ఎక్వ తక్వ మాటలు ఇనుడు బంద్ జేసినా. ఆళ్లంతా మతిలేని కాకుల్లెక్క గొడ్తున్రు నాకిప్పుడు.

చేప బురదల్ల తిరుగుతానే ఉంటది దినాం. అట్లని చేప బురద నంటించుకోదు వంటికి. నేను కూడ గట్లనే జేస్త... ☆